క్లుప్తంగా

సివిల్ సర్జన్ రీజినల్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ శిరీష



బనగానపల్లెరూరల్: పట్టణంలోని ప్రభుత్వ వందపడకల వైద్యశాలలో సివిల్ సర్జన్ రీజినల్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్ఆర్ఎంఓ) గా డాక్టర్ శిరీష ఇటీవల బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తాను గతంలో ఇదే వైద్యశాలలో విధులు నిర్వర్తించానని చెప్పారు. మెరుగైన వైద్యసేవలందిస్తున్నామని, ప్రభుత్వ వైద్యశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

411 మందికి 'జగనన్న చేదోడు' లబ్ధి

కొలిమిగుండ్ల: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు జగనన్న చేదోడు పథకం కింద 411 మందికి లబ్ధి చేకూరిందని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారని చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జమ చేశారని పేర్కొన్నారు.

డోన్ సొసైటీ చైర్మన్‌గా తిరుమలరెడ్డి



డోన్ టౌన్: జిల్లా సహకార బ్యాంక్ డోన్ బ్రాంచ్ సొసైటీ చైర్మన్‌గా తిరునాంపల్లె తిరుమల రెడ్డిని నియమించినట్లు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతున్న చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన దోంతిరెడ్డి వెంకటసుబ్బమ్మ పదవీ కాలం ఈనెల 28వ తేదీతో ముగియడంతో తిరుమల రెడ్డి నియామానికి మార్గం సుగమమైంది. మండలంలోని తిరునాంపల్లె గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి గ్రామ సర్పంచ్‌గా చేశారు. అలాగే పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి నమ్మినబంటుగా ఉంటున్నారు.

కబడ్డీలో యు.కొత్తపల్లి విద్యార్థిని ప్రతిభ



ఎం.గీతాంజలిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ రూరల్ : స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో యు.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.గీతాంజలి ప్రతిభ చూపిందని హెచ్‌ఎం చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. విజయనగరం జిల్లాలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగిన 66వ రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుతో కలిసి వెళ్లి ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు చెప్పారు. ఎం.గీతాంజలి, తర్ఫీదునిచ్చిన పీడీ సుధాకర్‌ను అభినందించారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

అవుకు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అజాంఖాన్ కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన వీడియో కాన్ఫరెన్స్‌కు మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమానికి డీటీ ప్రసాద్‌బాబు, పశు వైద్యాధికారి భారతీదేవి, ఏఓ ప్రసాద్ రావు, ఈఓఆర్డీ రామకృష్ణవేణి, ఎంఈఓ శ్రీధర్ రావు, ఏపీఎం విజయగోపాల్, ఏపీఓ అనీఫా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగసుంకమ్మ, శివమ్మ హాజరయ్యారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బచ్చు శ్రీనివాసులు

బనగానపల్లె: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అవుకు తహసీల్దార్ బచ్చు శ్రీనివాసులును సోమ వారం నియమించారు. బనగానపల్లె తహసీల్దార్‌గా పనిచేస్తున్న రామకృష్ణ పదోన్నతిపై డిప్యూటీ కలెక్టర్‌గా అమరావతి హైవేకు బదిలీ చేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో జిల్లా ఉన్నతాధికారులు శ్రీనివాసులును ఇన్‌చార్జ్‌గా నియమించారు.

పథకాలపై ఇంటింటి ప్రచారం

డోన్: మహిళలకు ప్రభుత్వం అందజేస్తున సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు తెలియజేసే కార్యక్రమాన్ని సోమవారం అన్ని సచివాలయాల పరిధిలో అధికారులు ముమ్మరంగా చేపట్టారు. 16వ సచివాలయ పరిధిలో ఉద్యోగులు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపునేస్తం, జగనన్న అమ్మ ఒడి, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా పథకాల గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ పథకాలతో మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. వెల్ఫేర్ అధికారి రమేష్, అడ్మిన్ షేక్షావలి, మహిళా పోలీసు రహెనాబేగం, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ సంబురం

- గడప వద్దకే సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- కోవెలకుంట్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో ప్రతి ఇంట్లో సంతోషం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పాలన కొనసాగిస్తూ సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని చెప్పారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని గ్రామ సచివాలయం-1 పరిధిలో సోమవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, లీగల్‌సెల్ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, అమడాల శంకరయ్య, తదితరులతో కలిసి ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్లలో అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఉంటే ధ్రువ పత్రాలతో సమీపంలోని గ్రామ సచివాలయంలో సంప్రదిస్తే అధికారులు విచారించి వర్తించేలా చేస్తారని చెప్పారు. గ్రామంలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలు వింటూ కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపగా, మేజర్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీతారాంనగర్‌లో సీసీరోడ్లు, విద్యుత్ స్తంభాలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తమ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అంశాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ మరింత గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు లోకేశ్వరెడ్డి, ఎల్‌వీ సుధాకర్ రెడ్డి, డీవీ శేషిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామసుబ్రహ్మణ్యం, హరీష్, ఈఓ బాలాంజనేయులు, నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, నాగార్జునరెడ్డి, శ్రీరాముల అబ్రహాం, అమడాల భాస్కర్‌రెడ్డి, బూసి భాస్కర్‌రెడ్డి, హరినాథరెడ్డి, శ్రీనివాసనాయక్, సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

రూ. 5.64 లక్షల మేర లబ్ధి:

గాంధీనగర్‌కు చెందిన వాసగిరి కళావతి అనే లబ్ధిదారురాలికి వివిధ పథకాలతో రూ. 5.64 లక్షల లబ్ధి చేకూరింది. అలాగే పుట్టూరు రమేష్ కుటుంబానికి రూ. 5.19 లక్షలు, దూదేకుల మహబూబ్‌బాషా కుటుంబానికి రూ.4.79 లక్షలు, అక్బర్ కుటుంబానికి రూ.4.66 లక్షలు, మల్లికార్జున కుటుంబానికి రూ.4.01 లక్షలు, మహబూబ్‌బీ కుటుంబానికి రూ.3.80 లక్షల లబ్ధి చేకూరిందని లబ్ధిదారులు పేర్కొన్నారు.

ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు



ఇత్తడి తొడుగు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజ స్తంభానికి లలితా సుందరేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం ఇత్తడి తొడుగు ఏర్పాటు చేశారు. దాదాపు 17ఏళ్ల క్రితం ఆలయ జీర్ణోద్ధరణ సమయంలో చెక్కతో ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. కాలక్రమేణా దెబ్బతింటుండటంతో ఇత్తడి తొడుగు అమర్చాలని నిర్ణయించుకున్నారు. 31అడుగుల ఎత్తున ఉన్న ధ్వజ స్తంభానికి రూ.3లక్షలతో 185 కిలోల ఇత్తడితో వివిధ రకాల ఆకృతులతో ఆకట్టుకునేలా రూపొందించారు. వైఎస్సార్ కడప జిల్లా వనిపెంటకు చెందిన కళాకారులు ఇత్తడి తొడుగును తయారు చేశారు. తొడుగుకు బంగారు వర్ణం వేశారు. ధ్వజ స్తంభం మిలమిల మెరిసి పోతుండటంతో ఆలయం కొత్త కళను సంతరించుకుంది.

కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీవిద్య

బనగానపల్లెరూరల్: ఉపాధి పనులకు వచ్చే రోజువారి కూలీల సంఖ్య పెంచాలని డోన్ క్లస్టర్ డ్వామా ఏపీడీ శ్రీవిద్య తెలిపారు. సోమవారం మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కూలీలు ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో ఎన్ఎంఎంఎస్ యాప్ లోనే హాజరు వేయాలని సూచించారు. కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యం లేదని తెలిపారు. నంద్యాల జిల్లాలో రోజూ లక్ష మంది కూలీలకు పనులు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని చెప్పారు. డోన్ క్లస్టర్‌కు ప్రతి రోజూ 28వేల మంది కూలీలు వచ్చేలా టార్గెట్ విధించారని, త్వరలోనే లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. ఉపాధి పనులు కల్పించడంతో జిల్లాలోనే బనగానపల్లె మండలం నాల్గో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. టీఏ రామ్మోహన్, ఏపీఓ హరికృష్ణ,టీఏ,ఎఫ్ఏ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం, అభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: నగర పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కాలనీల్లో చేపట్టే పనులు, చేసిన అభివృద్ధి పనులను కమిషనర్ రమేష్ బాబు వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు. నగర పంచాయతీలో చేపట్టే అభివృద్ధి పనులకు సభ్యుల అమోదం తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు నాగవెంకటేశ్వర్లు, పర్వీన్, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, మధు,సాయి,షేక్ ముబీనా, వెంగమ్మ, నాగజ్యోతి, టీపీ అంజద్ బాషా పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా అల్లాబకాష్ దర్గా ఉరుసును పురస్కరించుకొని దాతల సహకారంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి న్యూ కేటగిరీ బండలాగుడు పోటీలు సోమవారం నిర్వహించారు. ఇందులో 7జతల వృషభాలు పాల్గొనగా వైఎస్సార్‌సీపీ గ్రామనాయకులు యామసాని రామమహేశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. డోన్ మండలం కొత్తకోట కాంత్ వృషభాలు, అనంతపురం జిల్లా పుల్లెం గోవిందు వృషభాలు సంయుక్తంగా ప్రథమ, బేతంచెర్ల మండలం హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు ద్వితీయ, కోడుమూరు మండలం దుబ్బన్న వృషభాలు తృతీయ, బేతంచెర్ల మండలం కే.రామసుబ్బారెడ్డి వృషభాలు నాల్గొవ, బేతంచెర్లకు చెందిన మేకల వెంకటరాముడు 5వ, ప్యాపిలి మండలం పీఆర్ పల్లె గోపాలు, అనంతపురం జిల్లా యాడికి మండలం దయ్యాల మడుగుకు చెందిన నారాయణ రెడ్డి వృషభాలు 6వ స్థానంలో నిలిచాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2,500 నగదు అందజేశారు.

ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా అల్లబకాష్ దర్గా ఉరుసును పురస్కరించుకొని ఏపీ, తెలంగాణా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. సోమవారం నిర్వహించిన పోటీల్లో రెండు రాష్ట్రాల నుంచి ప్రాంతాల నుంచి 25 జట్లు హాజరయ్యాయి. కాగా పోటీలు మంగళవారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నిర్దేశించిన బహుమతి అందజేస్తామని చెప్పారు.

గాంధీజీ ఆశయ సాధనకు పాటుపడాలి





గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్,కమిషనర్, ఆవోపా ఆధ్వర్యంలో..

డోన్ టౌన్: గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్ర పటానికి కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరితో పాటు పట్టణంలోని 16 సచివాలయాలు, పలు ప్రజా సంఘాలు,విద్యార్థి సంఘాల నాయకులు నివాళులర్పించారు.అలాగే డోన్ ఆవోపా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు మాకం క్రిష్ణకిషోర్, జొన్నలగడ్డ శ్రీనివాసుల ఆధ్వర్యంలో సభ్యులు, ఆర్యవైశ్యులు స్థానిక పాతబస్టాండ్‌లోనున్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గార్లపాటి మద్దిలేటి,కార్యదర్శి ఉన్నిగోర్ల జనార్దన్ నివాళులర్పించారు.

బేతంచెర్ల: అహింస, శాంతిని ఆయుధాలుగా చేసుకొని దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, రాజేంద్ర కోరారు. సోమవారం స్థానిక అమ్మవారి శాలలో ఆర్యవైశ్యులు, వాసవీ, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని, గుప్త, గుండా ఉమాదేవి, వెంకట లావణ్య ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



బేతంచెర్లలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్యాపిలి: జాతిపిత వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులు సచివాలయ సిబ్బంది ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జలదుర్గం, ప్యాపిలి వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారులు ఇంతియాజ్ ఖాన్, వాణిశ్రీ మాట్లాడారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్టీ పునరుద్ధరణపై ఏక సభ్య కమిషన్ విచారణ

- వాల్మీకులతో పాటు వాదనలు వినిపించిన గిరిజనులు
- సమగ్ర అధ్యయనం తర్వాతే ప్రభుత్వానికి నివేదిక : శామ్యూల్ ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్

డోన్: బోయ,వాల్మీకుల స్థితిగతుల గురించి సంపూర్ణ అధ్యాయనం చేసి ప్రభుత్వానికి నివేధిక అందజేస్తామని వాల్మీకుల సమస్యపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్‌మ్యాన్ కమిషన్ రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం వాల్మీకి, బోయ, సుగాలి, ఎరుకలి సామాజిక వర్గాలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో ఎందుకు చేర్చాలనే దానితో పాటు ఎందుకు చేర్చకూడదనే అంశాలు, అభ్యంతరాలను ఆయా వర్గాల నుంచి తెలుసుకున్నారు.

1967లో ఎస్టీలుగా మార్చారు..

రాష్ట్ర అవతరణకు ముందు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎస్సీగా ఉన్న వాల్మీకి బోయలను 1967లో ఎస్టీలుగా ప్రభుత్వం మార్చిందని వాల్మీకి సంఘం నేతలు శీలం భాస్కర్‌నాయుడు, తొప్పెల శ్రీను, మల్లెంపల్లె రామచంద్రుడు, వలసల రామకృష్ణ, సుభాష్ చంద్రబోస్, పోస్టుపసాద్, పూల శ్రీను, బుర్రు శ్రీధర్, అనుమన్న, బేతంచెర్ల మురళీకృష్ణ కమిషన్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ దృష్టికి తెచ్చారు. ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగిస్తే తప్ప వాల్మీకి బోయలు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించలేరని, అక్షరాస్యత శాతం పెంచలేమని చెప్పారు. బోయలకు కులవృత్తి లేనందువల్ల దొంగతనాలు, దోపిడీలు, అక్రమ నాటుసారా తయారీ రంగాల్లోకి వెళ్లి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎస్టీలుగా ఉన్న ఆచార వ్యవహారాలు, బోయల ఆచార వ్యవహారాలతో ఇమిడి ఉన్నందువల్ల ఎస్టీలుగా మార్చేందుకు సిఫారసు చేయాలని కోరారు.

తమకే ఉపాధి లేదు..

ప్రస్తుతం ప్రభుత్వం ఎస్టీలకు కల్పిస్తున్న 6 శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఏమాత్రం సరిపోవడం లేదని ఎరుకలి, సుగాలి సంఘం నేతలు మోటా రాముడు, సుంకన్న, గోపాల్, రామయ్య, అడ్వకేట్ రాముడు, నాయకులు కమిషన్ దృష్టికి తెచ్చారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తమకు అనేక అభ్యంతరాలు ఉన్నాయన్నారు. వారిని జాబితాలో చేరిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. డోన్ ఆర్‌డీఓ వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వాల్మీకి సంఘం నాయకులు ఆస్పరి శ్రీనివాసులు, బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ విద్యాసాగర్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మేకల రాజు, పెద్దయ్య పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి

అవుకు: పాడి పశువులకు ఎద సూదులు వేయించటం వల్ల కలిగే ప్రయోజనాలపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని అవుకు పశువైద్యాధికారి భారతీదేవి వీహెచ్ఏలకు సూచించారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో వీహెచ్ఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గేదె పుట్టిన నాటి నుంచి 3 సంవత్సరాలకు ఎదకు వస్తుందని, అలాగే ఒకసారి ఎదకు వచ్చిన తరువాత మళ్లీ ప్రతి 18 నుంచి 21 రోజుల మధ్యకాలంలో ఎదకు వస్తుందని తెలిపారు.వాటికి ఎద సూదులను వేయించటం వల్ల ముర్రా జాతి గేదెలు జన్మిస్తాయని, వీటి వల్ల అధిక పాల దిగుబడి రావటమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉంటుందని చెప్పారు. అలాగే ఎదసూదులు వేసిన 40 రోజులకు పశువులకు చూడి పరీక్షలు నిర్వహించేలా రైతులకు వివరించాలన్నారు. ఎల్ఎస్ఏ రాజేష్, వీహెచ్ఏలు ఈశ్వర్ నాయక్, నవీన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించుకోవాలి

కొలిమిగుండ్ల: రబీలో పంటలు సాగు చేసిన రైతులందరూ పంటలను నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతు మండలంలో రబీలో 12వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారన్నారు. 10,331 ఎకరాల్లో సాగైన పంటలు నమోదు చేశామని, మిగిలిన రైతులు చేయించుకోవాలని కోరారు. అలాగే పంట నమోదు చేసుకున్న రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. వీటితో పాటు పీఎం కిసాన్ ఈ-కైవైసీ చేయించుకోని రైతులు పోస్టాఫీస్‌లో రూ.50 చెల్లించి ఈ-కేవైసీ చేయించుకోవచ్చని వివరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని సుబ్బరాయుని కొత్తూరు రోడ్డులోని రైల్వే వంతెన సమీపంలో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామాంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. కచ్చితమైన సమాచారం మేరకు రైల్వే వంతెన సమీపంలో దాడి చేయగా ఐచర్ లారీలో బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉందని, దీంతో లారీ, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అవుకు మండలం గోకులదిన్నె గ్రామానికి చెందిన దూదేకుల హుసేనయ్య, నంద్యాల టౌన్‌కు చెందిన వెంకటయ్యశెట్టి, మహానంది మండలం అల్లీనగర్‌కు చెందిన బాలవెంకటరెడ్డి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కుళాయిల ఏర్పాటు

కొలిమిగుండ్ల: మండలంలోని కనకాద్రిపల్లె శ్మశాన వాటికలో పారిశ్రామికవేత్త పుచ్చ సాంబశివారెడ్డి రూ.1.50 లక్షలతో స్నానాల కోసం నిర్మించిన ఘాట్‌ను సోమవారం ప్రారంభించారు. అంత్యక్రియలు ముగిశాక స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో శ్మశాన వాటిక సమీపంలో బోరు వేసి ట్యాంక్ నిర్మించి కుళాయిలు ఏర్పాటు చేశారు. పుచ్చ వెంకట మల్లారెడ్డి, నాగమల్లారెడ్డి,గోపాల్‌రెడ్డి,శివశంకర్‌రెడ్డి,పెద్ద అంకిరెడ్డి పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి చేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అవుకు: కుష్టు వ్యాధి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవుకు మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉప్పలపాడు ప్రాథమిక కేంద్రం డాక్టర్ యమున స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్, డాక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు ప్రతి గ్రామంలోనూ స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఓ అశ్విన్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, వేణుగోపాలరాజు, థెరీసమ్మ, దానమ్మ, పీహెచ్ఎస్ మల్లీశ్వరి,ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు,వలంటీర్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీపీఓ రామచంద్రారెడ్డి, వైద్యురాలు సౌమ్య ప్రియ తెలిపాసోమవారం స్థానిక గౌరిపేటలోని ఆరోగ్య ఉప కేంద్రంలో జాతీయ కుష్టు నివారణ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

డోన్ రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో సోమవారం ఎంపీపీ ఆధ్వర్యంలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఇప్పటి వరకు లబ్ధిపొందిన వివరాలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పెద్దమల్కాపురం రోడ్డును పట్టించుకోలేదని, సమస్యను గుర్తించని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రోడ్డు వేయించారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు,జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, ఎంపీటీసీలు లక్ష్మన్న, చాట్ల మద్దయ్య, ఉప సర్పంచ్ రాజేశ్వరరెడ్డి, నాయకులు బద్దల నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ వరప్రసాద్‌రావు,ఏఈలు అబ్దుల్‌షఫి,సతీష్, ఐకేపీ ఏపీఎం రామాంజనేయులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న దృశ్యం

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

బేతంచెర్ల: ఫిబ్రవరి 11 జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. రాజీ అయ్యే కేసులు ఉంటే పరిష్కరించుకునేలా చూడాలని చెప్పారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో ఆయా గ్రామాల మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిధిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

ప్యాపిలి: రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, సీఐ శ్రీరాములు, ఎస్ఐ సీఎం రాకేశ్ తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం పౌరహక్కుల దినం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజంలో సోదరభావంతో మెలగాలని సూచించారు. ఎవరైనా కుల వివక్ష చూపితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎస్సీ ఎస్టీ విలేజ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

ఆవులను రోడ్లపైకి వదిలితే చర్యలు

బేతంచెర్ల: పట్టణంలోని ఆవుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి వదిలితే కఠిన చర్యలు తప్పవని నగర పంచాయతీ అధికారులు, పోలీసు అధికారులు తెలిపారు. సోమవారం పట్టణంలో రోడ్లపైన తిరుగుతూ లంపీస్కిన్ వ్యాధి భారీన పడిన ఆవులకు వెటర్నీ ఏడీ వసంతలక్ష్మీ, వైద్య సిబ్బంది స్వచ్ఛంద సంస్థల సభ్యుల సంరక్షణలో టీకాలు వేయించడమే కాకుండా, ట్యాగులు వేశారు. అనంతరం వాటిని యజమానులకు అప్పగించారు.

వసతులు కల్పించాలి

డోన్ టౌన్: పట్టణ శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ డీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గార్లపాటి మద్దిలేటి,కార్యదర్శి ఉన్నిగోర్ల జనార్దన్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తారకరామనగర్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, పోచా ప్రభాకర్‌రెడ్డి, ఆటో నగర్, కోట్ల సుజాతమ్మ కాలనీల్లో సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.